## క్లుప్తంగా

### శాకంబరీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ

**కొయ్యలగూడెం:** బయ్యనగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గోంగూర పత్రాలతో అలంకరించారు. ఆషాఢమాసం సందర్భంగా ప్రతీ శుక్రవారం అమ్మవారిని విశేష అలంకరణతో ముస్తాబు చేయనున్నట్లు అర్చకులు వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. వారాహి అమ్మవారి నవరాత్రులలో భాగంగా 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పూజలు విశేష కార్యక్రమాలు, అమ్మవారికి నైవేద్యం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు.

### పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

**కుక్కునూరు:** చిన్నారులకు పోషక విలువలన్న పౌష్టికాహారాన్ని అందిస్తే వారిలో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని, అంతేగాక చదువుల్లో రాణిస్తారని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.రుక్మిణికుమారి పేర్కొన్నారు. శుక్రవారం బెస్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో పౌష్టికాహారంపై ఆమె తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. తల్లితండ్రులు తమ చిన్నారులకు ఐరన్ ట్యాబ్లెట్లు, ఆల్బెండజోల్ టాబ్లెట్లు వాడటం వలన రక్తహీనత, నులిపురుగుల నుంచి చిన్నారులను రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బెస్తగూడెం పాఠశాల ఉపాధ్యాయులు, తులసీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు కృషి

**టి.నరసాపురం:** అనుక్షణం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట పంచాయతీ గిరిజన గ్రామమైన అబ్బుల్లాపురంలో శుక్రవారం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే బాలరాజుకు అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన వెంట జనసేన మండలాధ్యక్షులు అడపా నాగరాజు, నాయకులు నవీన్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

### ప్రత్యేక కౌంటర్ల పరిశీలన

**జంగారెడ్డిగూడెం:** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంతో పాటు పట్టణంలోని రిలయన్స్, మోర్ సూపర్ మార్కెట్‌లలో బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయా సూపర్‌మార్కెట్‌లలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లను సివిల్ సప్లాయిస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి, తహసీల్దార్ స్లీవజోజిలు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత సూపర్ మార్కెట్‌ల సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే కందిపప్పు, బియ్యాన్ని విక్రయించాలని సూచించారు.

### అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోండి

**కామవరపుకోట:** బాలింతలు, గర్భిణులు అంగన్వాడీ కేంద్రాలలో సేవలు పొంది, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సీడీపీఓ పి.బ్యూల అన్నారు. 100 రోజుల ప్రత్యేక అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం రావికంపాడు, ఆడమిల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండడానికి అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పొందాలన్నారు.కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ గణేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు బీవీఎల్ మంగాదేవి, ఎన్.వీరకుమారి, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల నిరసన



గవరవరం రైతు సేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**కొయ్యలగూడెం:** ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తీరుకు నిరసనగా గవరవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రం వద్ద సన్న చిన్న కారు రైతులకు నిర్వహించాల్సిన సమావేశానికి అధికారులు సిబ్బంది హాజరు కాకపోవడంపై రైతుల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నరసింహారాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖ ద్వారానే పశుగ్రాస వారోత్సవాలు అమలు కావాల్సి ఉండగా అధికారులు బాధ్యత రాహిత్యం వ్యవహరించడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపిన గోపాలకృష్ణ, గూడపాటి హర్ష, ఎస్ఆర్ఆర్ జయబాబు, అన్నంరెడ్డి బాబురావు, గూడపాటి నరసింహారావు, ఎస్.శ్రీనివాస్, బి.సత్యనారాయణ, వి.సత్యనారాయణ, బుజ్జిబాబు, నాగరాజు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

# శృతి మించుతున్న మందుబాబుల ఆగడాలు

**సేద్యపు భూమిలో విచ్చలవిడిగా పారేస్తున్న ఖాళీ మద్యం సీసాలు.. రైతుల గగ్గోలు**



ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులతో బీడు భూమిగా మారిన సేద్యం భూమి



వ్యవసాయ భూమిలో పేరుకుపోయిన ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు

**కొయ్యలగూడెం:** మందు బాబుల ఆగడాలు రోజు రోజుకూ శృతి మించుతున్నాయి. వ్యవసాయ భూముల్లో ఇష్టానుసారం మద్యం సేవిస్తున్నారు. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పట్ట పగలే మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలతో పంట భూమిలో పనులు చేసుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద కొనుగోలు చేసిన మద్యంతో వ్యవసాయ పొలాలలో తిష్ట వేసి రాత్రి వేళల్లో ఆగడాలు, అరాచకాలు సృష్టిస్తున్నారని, దీంతో వ్యవసాయ పనులు చేసుకోలేక నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మద్యం షాపుల పరిసర ప్రాంతాలు అన్నీ కూడా ఖాళీ మద్యం సీసాలు అదేవిధంగా ప్లాస్టిక్ గ్లాసులతో భూములు నిస్సారంగా తయారయ్యాయని, సేద్యం చేసుకోవడానికి వీలు లేకుండా పోయాయని గోడు వెళ్లబోసుకుంటున్నారు. రాత్రి వేళల్లో పంపుసెట్ల వద్ద మకాం ఏర్పాటు చేసుకున్న మద్యం రాయుళ్ల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రశ్నిస్తుంటే తిరగబడి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని కొయ్యలగూడెం రైతు మద్దిబోయిన శ్రీనివాస్ ఆరోపించారు. శృతిమించిన మద్యం రాయుళ్ల వ్యవసాయ భూములలో ఖాళీ మద్యం సీసాలను పగలగొడుతున్నారు. ఇవి గుచ్చుకొని కూలీలకు, పశువులకు సైతం తీవ్ర గాయాలు అవుతున్నాయన్నారు. దీంతో వేగలేక భూములను వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని దిప్ప కాయలపాడు రైతు, కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది పేర్కొన్నారు. పగటిపూట సైతం మద్యం రాయుళ్ల వ్యవసాయ పొలాలలో మకాం వేసి మహిళా కూలీలను వేధిస్తున్నారని దీంతో కూలీలు రాకపోవడంతో ఊడ్పుల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని బాధిత రైతాంగం పేర్కొంటుంది. ప్రతీ మద్యం షాపు పరిసరాలలో సుమారు పది ఎకరాలు పైగా మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులతో నిండిపోయాయని వాటిని ఏరించడానికి, తొలగించడానికి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. మద్యం సామగ్రిని కొనుగోలు చేసి తీసుకొచ్చిన ప్లాస్టిక్ సంచులతో సేద్యపు భూములు మరుభూములుగా మారాయని ఈ నేపథ్యంలో శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని రైతాంగం కోరుతుంది.

### పగిలిన మద్యం సీసాలతో గాయాలు



ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి. అందరం సన్నా చిన్నకారు రైతులమే. నాగలితో దుక్కు దున్నుతున్న సమయంలో పగిలిన మద్యం సీసా పెంకులు గుచ్చుకొని మేము, పశువులు గాయాల పాలవుతున్నాం.

–మద్దిబోయిన శ్రీనివాస్, కొయ్యలగూడెం

### శృతిమించిన మందు బాబుల ఆగడాలు



మందుబాబుల ఆగడాలు శృతిమించాయి. దీంతో వ్యవసాయ భూములను సేద్యం చేసుకోలేక రైతులు బీడు భూములుగా వదిలేశారు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు వ్యవస్థ దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలి.

కాకర్ల నంది, దిప్పకాయలపాడు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు

## ● ఆర్టీసీ బస్సులో కురిసిన వర్షం

జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి కోయిదా వెళ్లే బస్సులో వర్షం కురుస్తుండడంతో ప్రయాణికులు బస్సు లోపల గొడుగులు వేసుకొని ప్రయాణం సాగిస్తున్నారు. బస్సు జంగారెడ్డిగూడెం నుంచి బయలుదేరిన కొద్ది సమయానికే వర్షం రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీనిపై డిపో మేనేజర్ గంగాధర్‌రావును వివరణ కోరగా బస్సు టాప్‌లో చిన్న చిన్న రంధ్రాలు ఉండడంతో వర్షపు నీరు బస్సులోనికి వస్తోందని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



జంగారెడ్డిగూడెం: బస్సులో గొడుగులతో ప్రయాణిస్తున్న దృశ్యం →

## పేపర్ బ్యాగ్‌లతో పర్యావరణ పరిరక్షణ

**జంగారెడ్డిగూడెం:** పర్యావరణ పరిరక్షణకు పేపర్ బ్యాగ్‌లు, కప్‌లను వాడాలని సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో శుక్రవారం విద్యార్థులు తయారు చేసిన పేపర్ బ్యాగ్‌ల పంపిణీ నిర్వహించారు. సీఐ పి.రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ పేపర్ బ్యాగ్ డే సందర్భంగా స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పేపర్ బ్యాగ్‌లు, కప్‌లు తయారు చేశారన్నారు. ప్లాస్టిక్‌ను విడనాడాలి, పేపర్ బ్యాగ్‌లు వినియోగించాలంటూ వారు చేపట్టిన వినూత్న ప్రయత్నాన్ని ఉద్యమంలా మలచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ దీర్ఘకాలికంగా భూమిలో నిల్వ ఉండి విషపూరిత రసాయనాలు విడుదల చేస్తుందన్నారు. ప్లాస్టిక్ వల్ల జీవ వైవిధ్యం కూడా నాశనం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పేపర్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న సీఐ పి.రాజేష్

## పరశురామావతారంలో జగన్నాథుడు

**ద్వారకాతిరుమల:** పరశురామావతారంలో జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామి ఆలయంలో రథోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఒక చేత్తో గండ్ర గొడ్డలి, మరో చేత్తో కమండలం, పాత్రను పట్టుకుని ఉన్న పరశురాముడి అవతారం భక్తులకు కనువిందు చేసింది.

## నూకాలమ్మ రజిత వస్త్రానికి వెండి సమర్పణ

**జంగారెడ్డిగూడెం:** స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా నూకాలమ్మకు విశేషాలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ఆలయ ప్రధానార్చకులు మనోజ్‌శర్మ అభిషేకం చేశారు. మూలవిరాట్‌కు ఏకాదశి హారతి పూజలు, వేద దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహామంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ, అమ్మ వారి వెండి చీర తయారీకి మొగిలిసీడి వెంకటేశ్వరావు (శ్యామ్), శ్రీదేవి దంపతులు 5 తులాల వెండి, శ్రీ వైష్ణవి ఎలక్ట్రికల్ కార్పొరేషన్ వారు 5 తులాల వెండి, నౌడు ఆనంద్, వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు 5 తులాల వెండిని అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 20, స్థిరవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 65వ చండీ హోమం నిర్వహిస్తామని, పాల్గొనే భక్తులు ఆలయ కమిటీని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నూకాలమ్మకువెండిని సమర్పిస్తున్న దృశ్యం

## కౌలు రైతులకు సాగు హక్కుపత్రాల పంపిణీ



యర్రంపేటలో హక్కుదారు కార్డులతో రైతులు



రైతు సేవా కేంద్రంలో సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ దృశ్యం

**కొయ్యలగూడెం:** యర్రంపేటలో 1, 2 సచివాలయాల పరిధిలో పంటసాగు హక్కుదారు కార్డుల (కౌలు కార్డులు) పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు పంటహక్కుదారు కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. భూహక్కు కలిగిన రైతులు ఈ విషయంలో అపోహలు పడొద్దని, వారి అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలో కౌలు కార్డులను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. ఎంపీటీసీ నారా అన్నపూర్ణ, సర్పంచ్ చాపల యేసు రత్నం, యర్రంపేట వీఆర్‌వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**పోలవరం రూరల్:** పోలవరం రైతు సేవా కేంద్రంలో సీసీఆర్‌సీ కార్డులు జారీకి సంబంధించి గ్రామ సభ నిర్వహించి, సాగుదారులను గుర్తించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురికి సీసీఆర్‌సీ కార్డులను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ కరిబండి నాగరాజు అందజేశారు. కౌలు కార్డులు పొందిన రైతులు రుణాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వో దత్తు, రైతులు పాల్గొన్నారు.

## పలువురికి ట్రిపుల్ ఐటీలో సీటు

**జంగారెడ్డిగూడెం:** ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాలలో జంగారెడ్డిగూడెం బాయ్స్ హై స్కూల్ కి చెందిన కుందు మోహన సతీష్, చింతపల్లి ప్రశాంత్, గండి రాకేష్‌లు మొదటి లిస్టులోనే సీటు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు లోవ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు మొదటి నుంచి ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ, పదో తరగతిలో మంచి మార్కులు సాధించారని ఈ ప్రాతిపదికన నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారన్నారు.

**ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కవిత**

**లింగపాలెం:** కె.గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కొట్టె కవిత శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించినట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.నరసింహారావు తెలిపారు. కె.గోకవరానికి చెందిన వీర్రాజు కుమార్తె పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం ద్వారా ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిందన్నారు. కవితను మండల విద్యాశాఖ అధికారులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. మండలం నుంచి ముగ్గురు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.



కుందు మోహన సతీష్



చింతపల్లి ప్రశాంత్



గండి రాకేష్



కొట్టే కవిత

## కందిపప్పు, రైస్ ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

**జంగారెడ్డిగూడెం:** ప్రభుత్వం బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు అందిస్తున్న నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం కందిపప్పు, రైస్ ప్రత్యేక కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్, రైల్ మిల్లర్స్ అసోసియేషన్, దాల్ అండ్ కిరాణా అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో కందిపప్పు, బియ్యం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కందిపప్పు, రైస్ ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**రైతు బజారు ఏర్పాటు చేయాలని వినతి**

జంగారెడ్డిగూడెం పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని మండల వినియోగదారుల కౌన్సిల్ సభ్యులు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే రోషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం, పరిసర గ్రామాలలో సుమారు లక్షమంది జనాభా జంగారెడ్డిగూడెం పట్టణంలో వ్యాపార అవసరాలు తీర్చుకుంటున్నారు. వినతిపత్రం అందించిన వారిలో కౌన్సిల్ ప్రెసిడెంట్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కుకునూరి రామచంద్రరావు, ఆర్.భాస్కరరావు, హీరా హకీం, ఎల్ఆర్ కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**జంగారెడ్డిగూడెం రూరల్:** మానవత సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం గురవాయిగూడెం మద్దిక్షేత్ర సమావేశ మందిరంలో జరిగింది. నూతన కార్యవర్గం సభ్యులచే మానవతా రీజనల్ కో ఆర్డినేటర్ త్రిపుర సుందరి ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షులుగా ఆకుల ధర్మరాజు, అధ్యక్షులుగా అయినాల వెంకట రమణ మూర్తి, ఉపాధ్యక్షులుగా అల్లూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మహంకాళి రంగప్రసాద్, కోశాధికారిగా ఇమ్మంది మురళీ మాధవరావు, సహాయ కార్యదర్శిగా పల్లి వెంకట రెడ్డి, ఈసీ పర్యావరణ సభ్యులుగా దల్లి రామాంజనేయరెడ్డి, ఈసీ విద్యా విభాగం సభ్యులుగా పెనుమర్తి సురేష్‌బాబు, ఈసీ ఎమర్జెన్సీ సభ్యులుగా మొగిలి నీడి వెంకటేశ్వరరావు, ఈసీ అవేర్‌నెస్ సభ్యులుగా భరద్వాజ రామకృష్ణ ప్రసాద్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గ సభ్యులు

### హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

**జంగారెడ్డిగూడెం:** ప్రజల సౌకర్యార్థం అతి తక్కువ ధరలో జంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్)కు నూతనంగా స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సులు ప్రారంభించినట్లు డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా బస్సులు బయలు దేరే సమయాలు, టిక్కెట్ ధరలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి ఎంజీబీఎస్ అప్పర్ బెర్త్ రూ. 770, లోయర్‌బెర్త్ రూ. 840, బీహెచ్‌ఈఎల్‌కు అప్పర్ బెర్త్ రూ. 810, లోయర్ బెర్త్ రూ. 890గా నిర్ణయించినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం నుంచి 4875 సర్వీసు రాత్రి 9.45కు బయలుదేరుతుంది. అలాగే 4874 సర్వీసు బీహెచ్‌ఈఎల్ నుంచి రాత్రి 9.15 బయలు దేరుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

### కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలి

**ద్వారకాతిరుమల:** నాయీ బ్రాహ్మణుల సంఘ కల్యాణ మండప నిర్మాణ నిమిత్తం ద్వారకాతిరుమలలో 50 సెంట్లు ప్రభుత్వ భూమిని కేటాయించారు. మండలంలోని గౌడ, శెట్టిబలిజ నాయకులు గౌడ సంఘం మండల అధ్యక్షుడు మిడతా రామకృష్ణ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలో గౌడ, శెట్టిబలిజ కల్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

### విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**చింతలపూడి:** వసతి గృహ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ రాంబాబు నాయక్ అన్నారు. ఆశ్రం ఎస్టీ హాస్టల్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం వసతిగృహ ప్రాంగణాన్ని, వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హాస్టల్ అభివద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 కిరణ్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీపీ రాంబాబు, ఎంఈఓ కిరణ్‌బాబు

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొయ్యలగూడెం:** సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రాధాకృష్ణ పేర్కొన్నారు. చెట్లు కొమ్మలు తొలగించే ప్రక్రియలో భాగంగా కొయ్యలగూడెం, చొప్పరామన్నగూడెం, అంకాలగూడెం, రేపల్లెవాడ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

**టి.నరసాపురంలో..**

టి.నరసాపురం సెక్షన్ పరిధిలోని మక్కినవారిగూడెం సబ్‌స్టేషన్, బొర్రంపాలెంలో సెక్షన్ పరిధిలో బొర్రంపాలెం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు.

**వేలేరుపాడులో..**

ఈ నెల 13న వేలేరుపాడు సెక్షన్ పరిధిలో గల వేలేరుపాడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోని వేలేరుపాడు, రుద్రమకోట, తట్కూరుగోమ్ము, రేపాకగోమ్ము, మేడేపల్లి, కోయమాదారం, రాళ్లపూడి, రామవరం, గుల్లవై, చిగురుమామిడి, నార్లవరం, కోయిదా, కట్కూరు, తీర్లపురం, యడవల్లి, భూదేవిపేట, కచారం, రెడ్డిగూడెం, పూచిరాల, వసంతవాడ, ఎస్. గొల్లగూడెం, మద్దిగట్ల, బొల్లపల్లి, చాగరపల్లి, బుర్రతోగు,పడమటిమెట్ట, కన్నాయిగూట్ట, టేకుపల్లి, సిద్దారం, టేకురు, సుద్దగుమ్మా, తురుపుమెట్ట, సీహెచ్ గొల్లగూడెం, మల్లారం, జిన్నెలగూడెం, తెల్లపల్లి, కేకే పాకలు, యర్రతోగు, చిట్టమరెడ్డిపాళెం, కుమ్మరిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు.

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

**జంగారెడ్డిగూడెం:** విద్యుత్ మరమ్మతుల కారణంగా జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ఈ నెల 13న ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడువాయి సెక్షన్ పరిధిలో గల తాడువాయి సబ్ స్టేషన్ లో మరమత్తుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో గల వినియోగదారులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. లక్కవరం సెక్షన్ పరిధిలో గల నిమ్మలగూడెం సబ్ స్టేషన్‌లో మరమత్తుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దర్భగూడెం సెక్షన్ పరిధిలో గల జీలుగుమిల్లి సబ్ స్టేషన్‌లో మరమత్తుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోని జీలుగుమిల్లి, వంకవారిగూడెం, రామణక్కపేట, దాట్లవారిగూడెం, రామన్నపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.